APTEL/2009/29308

స్నేహిత
# ఎక్స్‌ప్రెస్

నిజం దాగదు.. వార్త ఆగదు

తెలుగు దినపత్రిక

06-06-2026
శనివారం
హైదరాబాద్
సంపుటి: 17 I సంచిక: 222
పేజీలు: 04 I వెల: 5/-
ఎడిటర్: రాథోడ్ వినోద్ కుమార్

FOLLOW:
https://epaper.expresstelugudaily.com



2

## ఎస్‌యూ-57 యుద్ధ విమానాలను కలిసి రూపొందిద్దాం..



# చర్చకు సిద్ధమా?

బీఆర్ఎస్ నేతలు పాదయాత్రలు కాదు.. పాలమూరు నుంచి కాశీ వరకు పొర్లుదండాలు పెట్టినా వారి పాపాలు తీరవని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఆ పార్టీ చేసిన అన్యాయాన్ని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రజలు ఎన్నటికీ మరువరని చెప్పారు. జిల్లాలోని ప్రాజెక్టులను సీఎం రేవంత్ గురు, శుక్రవారాల్లో సందర్శించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం జడ్చర్ల మండలం గంగాపూర్ వద్ద నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు.

## బీఆర్ఎస్ 10 ఏళ్లు, నా 30 నెలల పాలనపై కేసీఆర్‌కు రేవంత్ రెడ్డి సవాల్

భవిష్యత్‌లో ఒక్కరిని కూడా పాలమూరు గడ్డపై గెలవనివ్వమని శపథం

పాలమూరు నుంచి కాశీ వరకు పొర్లుదండాలు పెట్టినా బీఆర్ఎస్ నేతల పాపాలు తీరవు

- ఆ పార్టీ చేసిన అన్యాయాన్ని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రజలు ఎన్నటికీ మరువరు
- 20 ఏళ్ల క్రితం ఈ జిల్లాలో నాటిన మొక్క.. తెలంగాణ సీఎంగా వృక్షమై నిలబడ్డాడు
- ఐదేళ్లు ఎంపీగా ఉన్నా.. ఐదుసార్లు కూడా పాలమూరుకు కేసీఆర్ రాలేదు
- కేసీఆర్, ఆయన కుమారుడు, మనవడు రాజ్యాలు ఏలుతారట
- వృత్తి పనులు చేసుకునేవారు ఏళ్ల తరబడి అలాగే ఉండాలట
- వలసలు ఆగాలంటే పాలమూరు జిల్లా సస్యశ్యామలం కావాలి
- రెండు పడకగదుల ఇళ్లు కట్టిన చోటే బీఆర్ఎస్ నేతలు ఓట్లడగాలి
- ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చిన చోటే నేను ఓట్లడుగుతానన్న రేవంత్ రెడ్డి

2



2

## దేశాన్ని అస్థిరపరిచేందుకు
# కుట్రలు

- గత 12 ఏళ్లుగా కాంగ్రెస్ గందరగోళాన్ని సృష్టిస్తూ అవకాశాలకై ప్రయత్నిస్తోంది
- కానీ దేశ ప్రజలు దానికి పదేపదే తగిన జవాబు ఇచ్చారు
- కాంగ్రెస్ ప్రభుత్వాల దుష్పరిపాలనతో ప్రజలు విసిగిపోయారు
- కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉంది
- అందుకే ఆ పార్టీ అక్కడ తమ ముఖ్యమంత్రిని మార్చాల్సి వచ్చింది
- మా ప్రభుత్వం దేశాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ పనిచేస్తోంది
- అందుకే దేశ ప్రజలు బీజేపీపై విశ్వాసం ఉంచుతూ పదేపదే గెలిపిస్తున్నారు
- ఈ దశాబ్దం ప్రపంచానికి విపత్తుల దశాబ్దంగా మారుతోంది
- మొదట, కోవిడ్ వల్ల భారీ సంక్షోభం ,ఆ తర్వాత పలుచోట్ల యుద్ధాలు చెలరేగాయి
- తీవ్రమైన ఇంధన సంక్షోభం యావత్ ప్రపంచాన్ని అస్తవ్యస్తం చేసింది
- దేశం సమష్టి సంకల్పం దృఢంగా ఉన్నప్పుడే అది ఏ లక్ష్యాన్నైనా సాధించగలదన్న మోడీ




2

## పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత

- సుస్థిరాభివృద్ధి, హరిత అభివృద్ధి లక్ష్యాలతో దేశం ముందుకు సాగుతోంది
- ప్రభుత్వం ఏ రకమైన షాక్ అబ్జార్బర్‌లను తొలగించలేదు
- రాహుల్ గాంధీ అసత్యపు వాదన నిరాధారమైనది
- భౌగోళిక రాజకీయ అనిశ్చితి ఉన్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ ఎందుకు నిలకడగా కొనసాగుతోంది
- గత దశాబ్ద కాలంలో మోడీ నాయకత్వంలో మరింత పటిష్టంగా దేశ ఆర్థిక వ్యవస్థ
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

## హైడ్రా భారీ ఆపరేషన్


200 ఎకరాల ప్రభుత్వ భూమికి ఫెన్సింగ్



2

## కుంభకోణాలకు కేరాఫ్ అడ్రస్ గా సింగరేణి

- విచారణ జరపాలని కిషన్ రెడ్డికి కేటీఆర్ లేఖ
- నిల్వల నుంచి రూ.1600 కోట్ల విలువైన బొగ్గును మాయం చేశారు
- వందల అక్రమాలు జరిగినా.. ఇంతవరకూ కేంద్రం ఎందుకు స్పందించలేదు
- సింగరేణి బొగ్గు అంటే తెలంగాణ ప్రజల ఆస్తి
- అలాంటి ఆస్తిని దోచుకుంటుంటే చూస్తూ ఊరుకోం



2

విలేకరులు కావలెను


స్నేహిత ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
expresstelugudaily.com

Contacts
తెలంగాణ
95500 21491

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో

ఎక్స్‌ప్రెస్ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు మండల రిపోర్టర్లు, యాడ్స్ ఏజెంట్స్ వెంటనే కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు..

# చర్చకు సిద్ధమా?



**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** పాలమూరు జిల్లాలో బీఆర్ఎస్ జెండా ఎగురనివ్వమని సీఎం రేవంత్ రెడ్డి శపథం చేశారు. గద్దెలు దిగాలి, దిమ్మెలు కూలాలి అని అన్నారు. పాలమూరు గడ్డపై భవిష్యత్‌లో ఒక్కరిని కూడా గెలవనివ్వమని అన్నారు. 30 నెలల కాంగ్రెస్ పాలన చెబితే రామాయణం, రాస్తే భారతం అవుతందన్నారు. కేసీఆర్ పదేళ్లపాలన, తన 30 నెలల పాలనపై చర్చించేందుకు అసెంబ్లీకి రావాలని సవాల్ విసిరారు. పాలనపై చర్చలో తాను ఓడితే క్షమామణ చెబుతానని రేవంత్ రెడ్డి అన్నారు. జడ్చర్ల సమీపంలోని గంగాపూర్ వద్ద బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు.

**చర్చలకు రమ్మంటే పారిపోతున్నారు..**

గోదావరి జలాల్లో జరిగిన అన్యాయంపై మహారాష్ట్ర సీఎంను అడుగుతామని, అవసరమైతే కడుగుతామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఎలాగైనా తుమ్మడిహట్టి వద్ద గోదావరిపై ప్రాణహిత చేవెళ్ల కడతామన్నారు. గోదావరి జలాలపై మహారాష్ట్ర సీఎం దాగుడుమూతలు అడుతున్నారని రేవంత్ రెడ్డి విమర్శించారు. చర్చలకు రమ్మంటే కూడా రాకుండా పారిపోతున్నారని ఆక్షేపించారు. రైతుల కష్టాలు తీర్చేందుకు పక్కా ప్రణాళికతో ముందు కెళ్తామన్న ఆయన కృష్ణా జలాల వివాదం 60 ఏళ్లుగా రావణకాష్ఠంలా రగులుతోందన్నారు. పక్కరాష్ట్రంతో చర్చలు జరిపి డిసెంబర్ లోగా పాలమూరు జలాలపై అనుమతులు సాధిస్తామన్నారు. ఏపీపై ఒత్తిడి తెచ్చి లేదా కొట్లాడి ఎన్‌వోసీ తీసుకొస్తామన్నారు.

**ఆ ప్రాజెక్టులను ఏడాదిలోగా పూర్తిచేస్తాం..**

పాలమూరు రంగారెడ్డికి 90 టీఎంసీల నీళ్లకు అనుమతులు సాధిస్తామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. డిండి ప్రాజెక్టుకు 20 టీఎంసీల నీళ్లకు అనుమతులు సాధించే బాధ్యత తనదని పేర్కొన్నారు. ఉద్దండాపూర్ వరకు ప్రాజెక్టులను ఏడాదిలోగా పూర్తి చేస్తామని వివరించారు. రెండున్నరేళ్లలో జూరాల వద్ద కొత్త రిజర్వాయర్‌ను నిర్మిస్తామని చెప్పారు. కర్ణాటక, మక్తల్ సరిహద్దుల్లో బ్రిడ్జి కమ్ బ్యారేజ్‌ను కడుతామన్నారు. పాలమూరు ప్రాజెక్టుకు గ్రీన్ ఛానెల్ ద్వారా నిధులను ఇస్తామని తెలిపారు. 2029 ఎన్నికల్లో కాంగ్రెస్‌ను మళ్లీ అధికారంలోకి తీసుకొస్తామని వివరించారు. పాలమూరు జిల్లాను దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. ఔర్ ఏక్ బార్ కాంగ్రెస్ సర్కారు అని ప్రజలతో కలిసి సీఎం నినాదించారు.

**మీరు చేసిన పాపాలు ప్రజలు మరువరు..**

కరీంనగర్‌లో ఓడిపోతానేమోనని ఒక నేత పాలమూరుకు వచ్చారని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కరీంనగర్ నుంచి వలస వచ్చిన కేసీఆర్‌ను గుండెల్లో పెట్టుకుని చూసుకున్నామని, పాలమూరు నుంచి పార్లమెంటు సభ్యుడిగా కేసీఆర్‌ను గెలిపించుకున్నామని గుర్తు చేశారు. ఐదేళ్లు పార్లమెంటు సభ్యుడిగా ఉన్నా ఐదుసార్లు కూడా పాలమూరుకు రాలేదని ఆరోపించారు. మేకవన్నిన పులి అని తెలియక కేసీఆర్‌ను ప్రజలు రెండుసార్లు గెలిపించారని, బీఆర్ఎస్ నేతలు పాదయాత్రలు కాదు, పొర్లు దండాలు పెట్టినా పాపాలు తీరవన్నారు. మీరు చేసిన పాపాలను ఎన్నటికీ ప్రజలు మరువరని రేవంత్ రెడ్డి అన్నారు. సమస్యల పరిష్కారంపై రైతులకు ఎప్పుడైనా భరోసా ఇచ్చారా అని ప్రశ్నించారు.

# దేశాన్ని అస్థిరపరిచేందుకు కుట్రలు

**నేషనల్ బ్యూరో :** ప్రతిపక్షాలపై తీవ్ర విమర్శలు గుప్పించారు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ. ఆత్మ నిర్భర్ భారత్ ప్రచారాన్ని ఎద్దేవా చేసే నిరాశావాదులు గతంలో దేశాన్ని ఇతరులపై ఆధారపడేలా చేశారని మండిపడ్డారు. అలాగే, రాజకీయ లబ్ధి కోసం దేశాన్ని అస్థిరపరిచేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. గత 12 ఏళ్లుగా కాంగ్రెస్ గందరగోళం, అనిశ్చితిని సృష్టిస్తూ అవకాశాల కోసం ప్రయత్నిస్తోందని, కానీ దేశ ప్రజలు దానికి పదేపదే తగిన జవాబు ఇచ్చారని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వాల దుష్పరిపాలనతో ప్రజలు విసిగిపోయారని అన్నారు. శుక్రవారం గుజరాత్‌లోని సూరత్‌లో పర్యటించిన మోడీ పలు ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసిన అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో ఈ మేరకు మాట్లాడారు. అలాగే కర్ణాటకలోని రాజకీయ పరిస్థితులపై ప్రధాని కీలక వ్యాఖ్యలు చేశారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉందని, అందుకే ఆ పార్టీ అక్కడ తమ ముఖ్యమంత్రిని మార్చాల్సి వచ్చిందని వ్యాఖ్యానించారు. తమ ప్రభుత్వం దేశాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ పనిచేస్తోందని మోదీడీ అన్నారు. అందుకే దేశ ప్రజలు బీజేపీపై, దాని అభివృద్ధి కార్యక్రమాలపై విశ్వాసం ఉంచుతూ, పదేపదే బీజేపీని గెలిపిస్తున్నారని పేర్కొన్నారు. "నేను ఇటీవల ఐదు దేశాల్లో పర్యటించాను. అక్కడ కూడా చర్చంతా బంగాల్ గురించే. బంగాల్, అసోం, పుదుచ్చేరిల్లో జరిగిన ఎన్నికల్లో బీజేపీ, ఎన్‌డీఏలు భారీ మెజారిటీని సాధించాయి. ప్రజల మా ప్రభుత్వంపై నమ్మకం ఉంచి మమ్మల్ని గెలిపించారు" అని మోడీ పేర్కొన్నారు.మరోవైపు, పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల వల్ల ప్రపంచ దేశాలు ఎదుర్కొంటున్న సంక్షోభం గురించి ప్రధాని మోడీ ప్రస్తావించారు. అంతర్జాతీయంగా చమురు, గ్యాస్ సరఫరా వ్యవస్థకు ఇంధన స్వయం సమృద్ధి ఎంత కీలకమో ప్రస్తుత ప్రపంచ సంక్షోభం చూపిస్తోందని మోడీ అన్నారు. అయితే, 2014 నుంచి దేశం తన సామర్థ్యాన్ని ఎలా పెంచుకుందో వివరించారు.

"ప్రపంచం సవాళ్ల దశ గుండా వెళుతోంది. ఈ దశాబ్దం ప్రపంచానికి విపత్తుల దశాబ్దంగా మారుతోందని నేను కొంతకాలం క్రితం చెప్పాను. మొదట, కోవిడ్ వల్ల భారీ సంక్షోభం ఏర్పడింది. ఆ తర్వాత పలుచోట్ల యుద్ధాలు చెలరేగాయి, తీవ్రమైన ఇంధన సంక్షోభం యావత్ ప్రపంచాన్ని అస్తవ్యస్తం చేసింది. ప్రపంచవ్యాప్తంగా పెట్రోల్ ధరలు నిరంతరం హెచ్చుతగ్గులకు లోనవుతున్నాయి. గ్యాస్ సరఫరా గొలుసులు కుప్పకూలుతున్నాయి. అయితే, ఈ ప్రపంచవ్యాప్త ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పటికీ, భారత్ స్థిరంగా, బలంగా నిల్చుంది. ప్రపంచంలోని వివిధ ప్రాంతాల నుంచి చమురు, గ్యాస్ సరఫరాలను సమకూర్చుకున్నాం. మరోవైపు పునరుత్పాదక ఇంధన రంగంలో పెట్టుబడులను చారిత్రాత్మక స్థాయికి పెంచాం. ఈ నిలకడకు దేశ ప్రజల సమష్టి సంకల్పమే కారణం. ప్రతికూలతను ఎదుర్కోవడం దేశం ఎప్పుడో అధిగమించింది. ఇక్కడి పౌరులు కలలు, సంకల్పంతో నిండి ఉన్నారు. అయితే, వారి సంకల్పాన్ని వాస్తవంగా మార్చడానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. దేశం సమష్టి సంకల్పం దృఢంగా ఉన్నప్పుడే అది ఏ లక్ష్యాన్నైనా సాధించగలదు" అని మోదీ స్పష్టం చేశారు.

# ఎస్‌యూ-57 యుద్ధ విమానాలను కలిసి రూపొందిద్దాం..


**నేషనల్ బ్యూరో :** వైమానిక దళాన్ని బలోపేతం చేసే దిశగా ఐదోతరం యుద్ధ విమానాన్ని అమ్ములపొదిలో చేర్చుకునేందుకు భారత్ ప్రయత్నాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో రష్యా అధ్యక్షుడు పుతిన్ నుంచి బిగ్ ఆఫర్ వచ్చింది. అధునాతన స్టెల్త్ సామర్థ్యాలు కలిగిన సుఖోయ్ ఎస్‌యూ 57 యుద్ధ విమానాలను భారత్‌తో కలిసి సంయుక్తంగా అభివృద్ధి, ఉత్పత్తి చేయడానికి, అలాగే కీలక సాంకేతికతలను పంచుకోవడానికి రష్యా సుముఖంగా ఉందని వెల్లడించారు. సెయింట్‌పీటర్స్‌బర్గ్‌లో అంతర్జాతీయ వార్తాసంస్థల అధినేతలతో మాట్లాడిన సందర్భంగా అధ్యక్షుడు ఈ ప్రతిపాదన చేశారు. భారత వైమానిక దళంలో ఐదో తరం యుద్ధ విమానాలు లేవు. మరోవైపు, పాకిస్థాన్ త్వరలో చైనాకు చెందిన షెన్‌యాంగ్ జె35ఎఈ స్టెల్త్ ఫైటర్స్‌ను సొంతం చేసుకోనుందని వార్తలు వస్తోన్న వేళ రష్యా నుంచి స్పందన రావడం గమనార్హం. రక్షణరంగంలో తమ రెండు దేశాల మధ్య ఎలాంటి పరిమితులు ఉండవని చెప్పిన పుతిన్.. పరోక్షంగా పాశ్చాత్య దేశాలకు చురకలు అంటించారు. ఆ దేశాలు సాంకేతికతను బదిలీ చేసేందుకు పలు ఆంక్షలు విధిస్తుంటాయని గుర్తు చేశారు. యితే ఎస్‌యూ 57 ఫైటర్ జెట్‌ను సంయుక్తంగా అభివృద్ధి చేసేందుకు రష్యా గతంలోనే భారత్‌కు అవకాశం ఇచ్చింది. 2018లోనే ఆ చర్చలు జరిగాయని ఆయన గుర్తుచేశారు. అయితే భారత్ అప్పుడు ఆ ప్రాజెక్ట్ నుంచి వైదొలగింది. ఆ యుద్ధ విమానంతో పూర్తిస్థాయి కార్యాచరణ అవసరాలు తీరవని ఐఏఎఫ్ నిర్ధరించడంతో భారత్ వెనక్కి తగ్గింది. ఇదిలాఉంటే.. స్వదేశీ పరిజ్ఞానంతో ఐదోతరం జెట్‌ను తయారు చేసేందుకు భారత్ చేపట్టిన 'అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్ క్రాఫ్ట్' (ఆమ్కా) ప్రస్తుతం అభివృద్ధి దశలో ఉంది. 2030 మధ్యలో వైమానిక దళంలో చేరొచ్చని తెలుస్తోంది.

**భారత్-చైనా సంబంధాల్లో జోక్యం ఉండదు: పుతిన్**

భారత్‌చైనా సంబంధాల్లో తమ జోక్యం ఉండబోదని పుతిన్ స్పష్టం చేశారు. అలాగే ఆ రెండింటి మధ్య ఉన్న సరిహద్దు వివాదాన్ని ఇరు దేశాలూ సామరస్యంగా పరిష్కరించుకుంటాయనే విశ్వాసాన్ని వ్యక్తంచేశారు. ఇక 2030లో తాను మరోసారి ఎన్నికల్లో పోటీ చేసే అంశంపై ఇప్పుడు మాట్లాడటం తొందరపాటే అవుతుందన్నారు. అప్పటికి తన ఆరోగ్యం ఎలా ఉంటుందో దేవుడికే తెలుసన్నారు. ప్రస్తుతం పరిష్కరించాల్సిన ఎన్నో అంశాలు ఉన్నాయని వ్యాఖ్యానించారు.

## ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ కొత్త వైస్ చీఫ్‌గా

# అశుతోష్ దీక్షిత్



**నేషనల్ బ్యూరో :** భారత వైమానిక దళంలో కీలకమైన నియామకం జరిగింది. ఐఏఎఫ్ నూతన వైస్ చీఫ్ గా ఎయిర్ మార్షల్ అశుతోష్ దీక్షిత్ నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర రక్షణ శాఖ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. రక్షణ రంగంలో అపార అనుభవం కలిగిన ఆయన, వైమానిక దళంలో అత్యంత కీలకమైన ఈ బాధ్యతలను త్వరలోనే స్వీకరించనున్నారు. ఎయిర్ మార్షల్ అశుతోష్ దీక్షిత్ 1986 డిసెంబరులో వైమానిక దళంలోని ఫైటర్ స్ట్రీమ్‌లోకి కమిషన్ అయ్యారు. ఆయన ఓ క్వాలిఫైడ్ ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్టర్ , ప్రయోగాత్మక టెస్ట్ పైలట్ కావడం విశేషం. అశుతోశ్ దీక్షిత్‌కు మిరాజ్ 2000, మిగ్21 వంటి వివిధ రకాల యుద్ధ విమానాలలో దాదాపు 3,300 గంటలకు పైగా ప్రయాణించిన అనుభవం ఉంది. ప్రస్తుతం ఈ నియామకానికి ముందు ఆయన వైమానిక దళ ప్రధాన కార్యాలయంలో డిప్యూటీ చీఫ్ ఆఫ్ ఎయిర్ స్టాఫ్గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆ సమయంలో భారత వైమానిక దళ ఆధునికీకరణ , కొత్త యుద్ధ విమానాల కొనుగోళ్లు, స్వదేశీ రక్షణ పరికరాల తయారీ ప్రక్రియలను ఆయన దగ్గరుండి పర్యవేక్షించారు. ఆయన సేవలను గుర్తిస్తూ భారత ప్రభుత్వం 'అతి విశిష్ట సేవా మెడల్' , 'వాయు సేనా మెడల్' పురస్కారాలతో బహుమతులతో సత్కరించింది.

## కుంభకోణాలకు

# కేరాఫ్ అడ్రస్‌గా సింగరేణి



**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** సింగరేణిలో జరిగిన రూ.1600 కోట్ల కుంభకోణంపై విచారణ జరపాలని కేంద్ర బొగ్గుగనుల శాఖమంత్రి కిషన్ రెడ్డికి కేటీఆర్ లేఖ రాశారు. సింగరేణి నిల్వల నుంచి సీఎం రేవంత్ రెడ్డి రూ.1600 కోట్ల విలువైన 40 లక్షల టన్నుల బొగ్గును మాయం చేశారని, స్టాక్ యార్డుల్లో ఉండాల్సిన బొగ్గును అప్పనంగా అమ్ముకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చాక సింగరేణి వరుస కుంభకోణాలకు కేరాఫ్ అడ్రస్ గా మారిందని విమర్శించారు. నైని కుంభకోణం మొదలుకొని.. వందల అక్రమాలు జరిగినా ఇంత వరకూ కేంద్రం ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. బొగ్గు నిల్వల్ని తనిఖీ చేసే సంబంధిత శాఖగానీ.. కాగ్ అధికారులు కానీ ఇప్పటి వరకూ ఎందుకు తనిఖీలు చేయలేదని నిలదీశారు. సింగరేణి బొగ్గు అంటే తెలంగాణ ప్రజల ఆస్తి అని, అలాంటి ఆస్తిని దోచుకుంటుంటే చూస్తూ ఊరుకోమని స్పష్టం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి సింగరేణిని మనుగడనే దెబ్బతీస్తున్నాయని.. కిషన్ రెడ్డికి రేవంత్ రెడ్డితో మిలాఖాత్ లేకుంటే వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. స్వయంగా కిషన్ రెడ్డే బొగ్గుగనుల శాఖ మంత్రిగా ఉండగా.. రాష్ట్రంలో ఇంత దుర్మార్గమైన కుంభకోణం జరగడం సిగ్గుచేటన్నారు. ఏప్రిల్ నెలాఖరు నాటికి మందమర్రిలో 7,20,00 మెట్రిక్ టన్నులు, శ్రీరాంపూర్ లో 8 లక్షల మెట్రిక్ టన్నులు, రామగుండం 1 లో ఆరు లక్షలు, రామగుండం 2 లో నాలుగు లక్షలు, భూపాలపల్లిలో 5 లక్షల 40 వేలు, ఇల్లందులో 3 లక్షల 50 వేలు, సత్తుపల్లిలో 2 లక్షల మెట్రిక్ టన్నులతోపాటు ఇతర వాటిని కలిపి సుమారు 40 లక్షల మెట్రిక్ టన్నుల స్టాక్ ఉందని లెక్కలు చూపించారు. కానీ కోల్ స్టాక్ పాయింట్ల దగ్గర ఆ బొగ్గు లేకపోవడమే ఈ కుంభకోణానికి అతిపెద్ద ఆధారమని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ మొత్తం వ్యవహారంలో కేంద్రం, రాష్ట్రం కలిసి లక్షల టన్నుల తెలంగాణ బొగ్గును పక్కదారి పట్టించాయా అనే బలమైన అనుమానం కార్మికలోకాన్ని వెంటాడుతోందన్నారు. ఈ స్కాంను దాచిపెట్టే కుట్రలు కొనసాగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే ఒక అఖిల పక్షాన్ని ఆయా గనుల వద్దకు పంపాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నామని కేటీఆర్ లేఖలో పేర్కొన్నారు. అసలు బొగ్గు ఉత్పత్తి కోసం కోల్ ఇండియా పాటించే విధానాలేంటి? కాంగ్రెస్ హయాంలో సైట్ విజిట్ సర్టిఫికేట్ ను ఎవరి ప్రయోజనాలు ఆశించి పెట్టారు? చివరికి కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులను ఎలా పక్కదారి పట్టించారు ? అనే అంశాలపై వాస్తవాలను బయటపెట్టకపోవడం కాంగ్రెస్ ముఖ్యమంత్రితో మీకున్న లోపాయికారి ఒప్పందాలను బట్టబయలు చేస్తోందని కేటీఆర్ విమర్శించారు. అన్ని టన్నుల బొగ్గు ఏమయిందో వెంటనే విచారణ జరిపించి నిజానిజాలేంటో తేల్చి.. బీజేపీ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని లేఖ ద్వారా డిమాండ్ చేశారు. ఈ కుంభకోణంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరారు. సింగరేణి సంస్థను కోలుకోని విధంగా దెబ్బతీసే ఈ కుంభకోణంపై ఒకవేళ విచారణ జరపకపోతే కార్మికలోకంతో కలిసి కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలపై బీఆర్ఎస్ పార్టీ జంగ్ సైరన్ మోగిస్తుందని హెచ్చరించారు.

# 2025-26 ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి రేటు 7.7 శాతం

**నేషనల్ బ్యూరో :** భారత ఆర్థిక వ్యవస్థ మరోసారి ప్రపంచ దేశాల అంచనాలను తారుమారు చేస్తూ సరికొత్త రికార్డులను సృష్టించింది. తాజాగా కేంద్ర గణాంక కార్యాలయం విడుదల చేసిన ప్రావిషనల్ ఎస్టిమేట్స్ ప్రకారం.. 202526 ఆర్థిక సంవత్సరంలో భారత జీడీపీ ఏకంగా 7.7% వృద్ధి రేటును నమోదు చేసింది. దేశీయంగా, అంతర్జాతీయంగా పలు ఆర్థిక సంస్థలు, రేటింగ్ ఏజెన్సీలు భారత వృద్ధి రేటు 7.4% నుండి 7.6% లోపు మాత్రమే ఉండవచ్చని అంచనా వేయగా, వాటన్నింటినీ మించి భారత ఎకానమీ ఈ అద్భుతమైన ప్రగతిని సాధించడం విశేషం. అంతేకాదు ఈ ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికం అయిన క్యూ4 (జనవరిమార్చి 2026) లో అయితే మరింత జోరుగా సాగి 7.8% గా నమోదైంది. మేక్ ఇన్ ఇండియా ఊతంతో మాన్యుఫాక్చరింగ్ రంగం అద్భుతమైన ప్రదర్శన కనబరిచింది. అటు ఐటీ, బ్యాంకింగ్, టూరిజం వంటి సేవా రంగాలు కూడా ఎగుమతులలో సరికొత్త మైలురాళ్లను అధిగమించాయి. కేంద్ర ప్రభుత్వం రహదారులు, రైల్వేలు, పోర్టులపై పెట్టిన పెట్టుబడులు, క్యాపెక్స్ నిధుల విడుదల మార్కెట్‌లో భారీగా ఉపాధిని సృష్టించడంతో పాటు ప్రైవేట్ పెట్టుబడులకు కూడా మార్గం సుగమం చేసింది. ప్రపంచవ్యాప్తంగా భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు నడుస్తున్నప్పటికీ.. భారత్ 7.7% వార్షిక వృద్ధిని సాధించడం ద్వారా, ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకుంది.




# బినామీ లావాదేవీలు చేయడం చట్టవిరుద్ధం

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** భారత దేశ పౌరులు బినామీ లావాదేవీలు చేయడం చట్టవిరుద్ధం అని, బినామీగా ఉన్న ఏ ఆస్తి అయినా, దాని యజమానికి ఎలాంటి నష్ట పరిహారం చెల్లించకుండా కేంద్ర ప్రభుత్వం జప్తు చేస్తుందని, వాస్తవ యజమాని, బినామీదారు ఇద్దరికీ బినామీ ఆస్తి లావాదేవీల నిషేధ చట్టం, 1988 ప్రకారం కఠినమైన జైలు శిక్ష తప్పదని, బినామీగా ఉన్న ఆస్తులను తిరిగి పొందేందుకు అసలు యజమానులు కోర్టుల్లో దావాలు కూడా వేయలేరని తెలంగాణ & ఏ.పి అదనపు ఆదాయపు పన్ను కమిషనర్ వై. శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్, సికింద్రాబాద్, తాజ్ త్రీస్టార్ లో శుక్రవారం తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ ట్యాక్స్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో "భారతదేశంలో బినామీ చట్టం పాటించడం, దర్యాప్తు & తీర్పు" అనే అంశంపై సదస్సు సీఏ సాంబ మూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ సదస్సులో వై. శ్రీకాంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ నల్లధనాన్ని అరికట్టే ప్రయత్నంలో 2016 లో మోదీ ప్రభుత్వం బినామీ ఆస్తి లావాదేవీల నిషేధ చట్టం, 1988 ను సవరించి "బినామీ లావాదేవీల (నిషేధ) సవరణ చట్టం, 2016"గా తీసుకవచ్చిందని, దేశంలో మరియు విదేశాలలో నల్లధనానికి వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం చేస్తున్న పోరాటంలో, 'బినామీ చట్టం' మరియు 'నల్లధనం (వెల్లడించని విదేశీ ఆదాయం మరియు ఆస్తులు) మరియు పన్ను విధింపు చట్టం, 2015' రెండూ నేడు సహాయపడుతూ మంచి ఫలితాలనిస్తున్నాయని అన్నారు. బినామీ లావాదేవీల (నిషేధ) సవరణ చట్ట ఉల్లంఘనకు ఏడేళ్ల వరకు జైలు శిక్షతో పాటు, బినామీ ఆస్తి యొక్క మార్కెట్ విలువలో 25% వరకు జరిమానా విధించబడుతుందని చెప్పారు. బినామీ లావాదేవీలు కేంద్ర ప్రభుత్వం నిషేదించింది కాబట్టి పౌరులు తమ పన్నులను సకాలంలో చెల్లించాలని మరియు బినామీ ఆస్తిని బహిర్గతం చేయాలనీ లేకుంటే సర్వం ఆస్తిని కోల్పోయే ప్రమాదాన్ని ఎదురుకోవలసివస్తుందని వై. శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షులు సీఏ చంద్రశేఖర్ వేముల మాట్లాడుతూ బినామీ లావాదేవీలను అరికట్టడానికి చార్టర్డ్ అకౌంటెంట్లుగా పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ఆస్తి పత్రాలు ఆడిట్ చేయించడంలో ఏదైనా అసాధారణ విషయాన్నీ గుర్తిస్తే వెంటనే పన్ను అధికారులకు అప్రమత్తం చేస్తామన్నారు. చార్టర్డ్ అకౌంటెంట్లు, పన్ను అధికారులతో సమన్వయంతో పని చేస్తారని, బినామీ లావాదేవీలు ప్రమాదకరమని, ప్రజలు వీటికి దూరంగా ఉండాలని, కుటుంబ సభ్యుల మధ్య తెలియకుండానే కొన్ని బినామీ లావాదేవీలు జరిగే అవకాశం ఉందని కూడా ప్రజలు గమనించాలని, అన్ని ఆర్థిక లావాదేవీలకు సంబంధించి తమ ఆడిటర్ల నుండి సరైన సలహాలు తీసుకోవాలని పౌరులకు సీఏ చంద్రశేఖర్ వేముల సూచించారు. ఈ సదస్సులో అసోసియేషన్ కార్యదర్శి సీఏ ఆశిష్ జోషి, కోశాధికారి సోమేశ్వర్ నెమ్మాని, సలహాదారు సీఏ రామ్‌దేవ్ బుటాడా, కంపిటేషన్ కమిటీ చైర్మన్ సీఏ అమృత్ కుమార్ కోటా, ఉపాధ్యక్షులు సీఏ పి.వి. నారాయణరావు, మాజీ అధ్యక్షులు సీఏ హితేష్ జైన్, సీఏ పూర్ణచంద్రరావు, గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు సీఏ రమణ రెడ్డి, సీఏ ప్రవల్లిక వేముల, సిఏ ప్రకాష్ చోకదా, సీఏ వెంకట్ రామ్, సీఏ శైలేంద్ర శర్మ, సిఏలీల కృష్ణ మోహన్ ఎన్. వి. చారి, అజయ్ వాల్వే, ఏపీ దహిమా తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత



**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని, ప్రకృతిని కాపాడటం, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించడం మనందరి కర్తవ్యమని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రదాని మోడీ ఏక్‌పేడ్‌మా కే నామ్‌పిలుపు స్ఫూర్తితో శుక్రవారం ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో మొక్క నాటారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఈకార్యక్రమం కేవలం మొక్కలు నాటే కార్యక్రమం మాత్రమే కాదని, అది తల్లిపట్ల గౌరవాన్ని వ్యక్తపరుస్తూనే ప్రకృతిని కాపాడుకోడం పట్ల సమాజంలో అవగాహన పెంపొందించే ఒక మహత్తర ప్రజా ఉద్యమమని తెలిపారు. ప్రకృతి పరిరక్షణ, వాతావరణ మార్పుల దుష్ప్రభావాల నివారణ, జీవవైవిధ్య సంరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి దాని సంరక్షణ బాధ్యతను కూడా తీసుకోవాలని మోడీ పిలుపుకు అందరు స్పందించాలని కోరారు. పర్యావరణ పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, సుస్థిరాభివృద్ధి, హరిత అభివృద్ధి లక్ష్యాలతో దేశం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. దేశ ప్రజలందరూ 'ఏక్ పేడ్ మా కే నామ్' కార్యక్రమంలో భాగస్వాములై, హరిత భారత నిర్మాణంలో తమ వంతు పాత్ర పోషించాలని సూచించారు. ప్రభుత్వం అన్ని షాక్ అబ్జార్బర్‌లను తొలగించడం వల్ల భారతదేశం ఆర్థిక సునామీ వైపు వెళుతోందని కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ తన స్వార్థ రాజకీయాల కోసం చేసిన అసత్యపు వాదన నిరాధారమైనదని మండిపడ్డారు. ఈ ఆరోపణలు దేశ ప్రజలలో లేని భయాందోళనలను రెచ్చగొట్టడమే. ఒకవేళ భారతదేశపు ఆర్థిక వ్యవస్థ షాక్ అబ్జార్బర్‌లను నిజంగానే తొలగించి ఉంటే, ముడి చమురు ధరలు, పశ్చిమ ఆసియాలో సంఘర్షణ, దిగుమతులు, ఎగుమతులపై సప్లై చైన్ లో అంతరాయాలు ఎదుర్కొంటున్నప్పటికీ, నిరంతర భౌగోళిక రాజకీయ అనిశ్చితి ఉన్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ ఎందుకు నిలకడగా కొనసాగుతోందన్నారు. ప్రభుత్వం ఏ రకమైన షాక్ అబ్జార్బర్‌లను తొలగించలేదు. 140 కోట్ల భారత ప్రజల సహకారంతో గత దశాబ్ద కాలంలో మోడీ నాయకత్వంలో దేశ ఆర్థిక వ్యవస్థను మరింత పటిష్టం చేశారు. కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం హయాంలో 2011 నుండి 2013 మధ్య, రూపాయి విలువ 36 శాతం పడిపోయింది. విదేశీ మారక నిల్వలు జూలై 2011లో సుమారు 294 బిలియన్ డాలర్ల నుండి ఆగస్టు 2013 నాటికి దాదాపు 256 బిలియన్ డాలర్లకు తగ్గాయి. దిగుమతుల కవరేజ్ మార్చి 2004 నుండి సెప్టెంబర్ 2013 నాటికి ప్రమాదస్థాయికి పడిపోయిందన్నారు. కాంగ్రెస్ పాలనలో జరిగిన అసలైన షాక్ అబ్జార్బర్ల తొలగింపు. రాహుల్ గాంధీ తెలుసుకోవలసిన నిజాలు ఎన్నో ఉన్నాయన్నారు. లోక్ సభలో ప్రతిపక్ష నాయకుడిగా కొనసాగుతున్న రాహుల్ గాంధీ, బాధ్యతారహితంగా ప్రపంచంలో భారత ప్రతిష్టను దిగజార్చే విధంగా ప్రవర్తించడం దేశ ప్రజలలో లేని భయాందోళనలు సృష్టించడం ఆపాలని సూచించారు. మోడీ ప్రభుత్వానికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి తేడా చాలా స్పష్టంగా ఉంది. కాంగ్రెస్ విపరీతమైన అవినీతి కుంభకోణాలతో దేశంలో బలహీనతలను సృష్టిస్తే మోడీ ప్రభుత్వం పునరుద్ధరణ శక్తిని సృష్టిస్తోంది. కొన్ని రోజులుగా ప్రతి కొన్ని నెలలకొకసారి, ఏదో ఒక అబద్ధపు, ఊహాజనిత, దేశ వ్యతిరేక, ప్రజా వ్యతిరేకతతో కూడిన తుస్సుమనే డ్రామా బాంబులతో రాహుల్ గాంధీ ఒక కొత్త కుట్ర సిద్ధాంతాన్ని సృష్టిస్తారు. ఆర్థిక సునామీ పొంచి ఉందని వితండ వాదనతో ప్రజలను రెచ్చగొట్టాలని, కేంద్రంలో మోడీ ప్రభుత్వాన్ని కూల్చి, ఆ కుర్చీలో తాను అమాంతం కూర్చోవాలని, ప్రధానమంత్రి పదవి తన కుటుంబ హక్కు అని, ఈ దేశంలో నేనే రాజుననే భ్రమలతో కాలం గడుపుతున్నాడని ఎద్దేవా చేశారు.

# హైడ్రా భారీ ఆపరేషన్

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శుక్ర హైడ్రా భారీ ఆపరేషన్ నిర్వహించింది. ప్రకృతిని పరిరక్షిస్తూ చారిత్ర రాళ్ల గుట్టలతో పాటు.. అతి పురాతన రాతి గుహలు, వాటి మధ్యన ఉన్న చెట్టూ.. చేమను హైడ్రా కాపాడింది. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం పుప్పాలగూడ ఖాజాగూడ సరిహద్దుల్లో శుక్రవారం 198 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా కాపాడింది. ఇందులో 250 కోట్ల సంవత్సరాల చారిత్రక రాళ్ల గుట్టలు కూడా ఉన్నాయి. గతంలో రాష్ట్ర ప్రభుత్వం హెచ్‌ఎండీఏకు కేటాయించిన 200ల ఎకరాలు కూడా ఉన్నాయి. చారిత్రక గుట్టలను కాపాడాలని కోరుతూ దశాబ్దాలుగా సొసైటీ టూ సేవ్ రాక్స్ ప్రతినిధులు పోరాడుతున్నారు. హైకోర్టును కూడా వీరు ఆశ్రయించారు. ఈ మేరకు రాతి గుట్టలతో పాటు.. ప్రభుత్వ భూమిని కాపాడాలని 2019లో మున్సిపల్, రెవెన్యూ శాఖలకు హైకోర్టు ఆదేశించింది. హద్దులు గుర్తించి ఫెన్సింగ్ వేయడం జాప్యం కావడంతో కబ్జాలకు ఆస్కారం ఇచ్చినట్టయ్యింది. ఇదే విషయాన్ని సొసైటీ టూ సేవ్ రాక్స్ ప్రతినిధులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ గారు క్షేత్రస్థాయిలో గతంలోనే పరిశీలించారు. రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులతో కలిసి హైడ్రా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రభుత్వ భూమిగా నిర్ధారించుకుని శుక్రవారం ఫెన్సింగ్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ భూమి విలువ రూ. 30వేల కోట్లు వరకూ ఉంటుందని అంచనా. సర్వే నంబరు 452/1 లో 174 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. అలాగే 454/1 సర్వే నంబరులో 119.05 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. మొత్తం 293.05 ఎకరాలు కాగా.. ఇందులో 263.05 ఎకరాలను గతంలో రాష్ట్ర ప్రభుత్వం హెచ్ ఎండీఏకు కేటాయించింది. రెండు గ్రామాల మధ్య ఓవర్‌ల్యాప్ ఇష్యూలతో 63.05 ఎకరాలు ప్రైవేటు వ్యక్తులకు చెందినదిగా రెవెన్యూ అధికారులు గుర్తించారు. దీంతో హెచ్‌ఎండీఏకు 200ల ఎకరాలు మాత్రమే మిగిలాయి. ఇవే చారిత్రక గుట్టల ప్రాంతంలో వివిధ దేవాలయాలకు 5 ఎకరాలు కేటాయించగా.. దర్గాకు 5 ఎకరాలు అప్పజెప్పినట్టు రెవెన్యూ రికార్డులు చెబుతున్నాయి. ఇలా ఎవరికి కేటాయించిన భూములు పోగా.. 200 ఎకరాల హెచ్‌ఎండీఏ భూమిని హైడ్రా శుక్రవారం కాపాడింది. సొసైటీ టూ సేవ్ రాక్స్ ప్రతినిధులు కోరిన విధంగా అక్కడ చారిత్రక బండ రాళ్లను కూడా హైడ్రా కాపాడినట్టయ్యింది. మంచి వ్యూ పాయింట్‌తో.. ఎంతో ఎత్తుగా.. సహజ సిద్ధంగా ఉన్న గుట్టలను, 250 కోట్ల సంవత్సరాల చరిత్ర గల కొండలను కాపాడి ప్రకృతిని పరిరక్షించారంటూ రాక్ సొసైటీ ప్రతినిధులు హైడ్రాను కొనియాడారు. రాళ్ల గుట్టలతో పాటు పలు ఆలయాలున్న చారిత్రక స్థలంలో అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా కాపాడిన హైడ్రాకు ప్రజలతో పాటు భక్తులు, పర్యావరణ ప్రేమికులు అభినందనలు తెలిపారు. దశాబ్దాల సమస్యను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం చూపిన చొరవను అభినందించారు. ఈ గుట్టలను ఆనుకుని ఉన్న భగీరథమ్మ చెరువును కూడా హైడ్రా పునరుద్ధరిస్తోంది. ఒక పక్క ఎత్తైన కొండ.. దిగువ భాగంలో ఉన్న భగీరథమ్మ చెరువు సిద్ధమైతే.. ప్రముఖ పర్యాటక ప్రాంతంగా విరాజిల్లుతుందని పలువురు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## రైతులకు సాగు నీరు నాణ్యమైన కరెంట్ అందిస్తే
# మంచి పంటలు పండిస్తారు





- పోచారం శ్రీనివాస్ రెడ్డి
- అవినీతికి ఆస్కారం లేకుండా ప్రభుత్వం పథకాలు కొనసాగుతున్నాయి
- కాసుల బాలరాజ
- ఎత్తొండ క్యాంప్లో 33/11 కేవీ సబ్‌స్టేషన్ ప్రారంభం
- ఎత్తొండ,క్యాంప్లో సామూహిక ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశం.

**కోటగిరి,స్నేహిత ఎక్స్ ప్రెస్:** రైతులకు నిజాంసాగర్ నీటితో పాటు నాణ్యమైన కరెంట్ అందిస్తే మంచి పంటలు పండిస్తారనీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ శాఖ ముఖ్య సలహాదారులు బాన్సు వాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో అవినీతి అక్రమాలకు ఆస్కారం లేకుండా ప్రభుత్వం పథకాలు సక్రమంగా కొనసాగుతున్నాయని రాష్ట్ర ఆగ్రోస్ ఇండస్ట్రియల్ చైర్మెన్ కాసుల బాలరాజ్ అన్నారు.శుక్రవారం కోటగిరి మండలం లోని ఎత్తొండ క్యాంప్,ఎత్తొండ గ్రామాలలో 33/11 విద్యుత్ ఉప కేంద్రంతో పాటుగా సామూహిక ఇందిరమ్మ ఇండ్ల ను పోచారం,కాసుల బాలరాజు ప్రారంభించారు.ఈ సందర్భంగా వారిరువురు మాట్లాడుతూ.సీఎం రేవంత్ రెడ్డి మహిళామణుల,పేదప్రజల పక్ష పాతి అని.రాష్ట్రంలో ప్రతి ఒక్కరికి సంక్షేమ,అభివృద్ధి పథకాలను అందిస్తున్నారని అన్నారు.రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కొనసాగుతుందని.ఇటీవల కాలంలో సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రంలో లక్ష ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించారని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు వడ్డీ లేని డ్వాక్రా రుణాలు,ఉచిత బస్సు సౌకర్యం వంటి మహిళా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు.పేదలకు రేషన్ కార్డులు మంజూరు చేస్తూ వారి ఆర్థిక పరిపుష్టికి దోహదపడుతున్నారని అన్నారు. గృహా,వ్యవసాయ అవసరాలకు ప్రభుత్వం నాణ్యమైన ఉచిత విద్యుత్ సరఫరా చేస్తుందన్నారు.ఎత్తొండ క్యాంపులో 33/11 కె.వి విద్యుత్ ఉప కేంద్రాన్ని ప్రారంభించుకోవడంతో ఇక్కడి ప్రాంత రైతుల,ప్రజల విద్యుత్ లోవోల్టేజ్ సమస్యలు పరిష్కారం అవుతాయని. బాన్సువాడ నియోజక వర్గంలో 44 వేల కరెంటు మోటర్లు ఉన్నాయని. మన నియోజక వర్గం నిజాంసాగర్ ఆయకట్టు కింద ఉన్నా మన ప్రాంత రైతులకు సాగర్ నీటితో పాటు నాణ్యమైన సమస్యలు లేని విద్యుత్ను సరఫరా చేయాలనే లక్ష్యంతో నియోజక వర్గంలో 33/11,132/33,220/132 విద్యుత్ కేంద్రాలను భవిష్యత్తు తరాల వారి అవసరాలను దృష్టిలో పెట్టుకొని నెలకొల్పడం జరిగిందని ఉద్ఘాటించారు. నియోజక వర్గంలోని విద్యుత్ వినియో గదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అవ్వాలనే ఉద్దే శంతో ముందు చూపు ప్రణాళికతో అనేక విద్యుత్ కేంద్రాలను నెలకొల్పడం జరిగిందని అన్నారు. అందరం కలిసి కట్టుగా పనిచేస్తే అభివృద్ధి జరుగుతుందన్నారు. ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశం చేసిన లబ్ధిదారులకు అభినందనలు శుభాకాంక్షలు తెలియజేశారు.స్వంత స్థలం ఉన్న పేదలకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయడంతో పాటుగా స్థలా లు లేనివారికి ప్రభుత్వ స్థలాలను కేటాయించి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని అన్నారు.అర్హులైన లబ్ధిదారులు తమ గ్రామంలోని పంచాయతీ కార్యదర్శికి దరఖాస్తు ఇవ్వాలని పిలుపునిచ్చారు. వాతావతరణ శాఖ చెప్పిన విషయాలు రైతులలో ఆందోనలు కలిగిస్తున్నాయి. ప్రస్తుతం నిజాంసాగర్ లో ఏడు టీఎంసీల నీరు ఉందని.ఈ నీటిని అందరి నిర్ణయం మేరకు పొదుపుగా వాడుకోవడానికి ప్రణాళికలు రచించి త్వరలో నీటి విడుదలపై తేదీలను ప్రకటిస్తామని అన్నారు.కోటగిరిలో 50 పడకల ఆస్పత్రి కడుతున్న సందర్భంగా కోటగిరికి చెందిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎత్తొండ గ్రామానికి బదలహిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో గైని వీరమణి అర్జున్, మటపతి శ్వేత సూర్యకాంత్,ఆర్డీఓ విజయకుమారి,నిజామాబాద్ జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ రాజేశ్వర్ రావు,మార్కెట్ కమిటీ చైర్మన్ గైక్వాడ్ హనుమంతు,వైస్ చైర్మన్ కులకర్ణి అనిల్, కోటగిరి మండలం సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు బర్ల మధుకర్, కోటగిరి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షాహిద్ హుస్సేన్,మాజీ జెడ్పిటిసిలు పుప్పాల శంకర్,శంకర్ పటేల్,హౌసింగ్ డిఈ గంగాధర్, హౌసింగ్ ఆదర్శ గౌడ్, బోధన్ విద్యుత్ శాఖ డీఈ ఓపీ ఎండి ముక్తార్,విద్యుత్ శాఖ నిజామాబాద్ కన్స్ట్రక్షన్ డీఈ డి.వెంకటరమణ, విద్యుత్ శాఖ నిజామాబాద్ సివిల్ ఈఈ కే.స్వామి,విద్యుత్ శాఖ నిజామాబాస్ కన్స్ట్రక్షన్ ఏడీఈ తోట రాజశేఖర్, ఏడీఈ ఓపీ రుద్రూర్ నిజామాబాద్ నవీన్ రెడ్డి,ఏడీఈ ట్రాన్స్కో నిజామాబాద్ కే.నటరాజ్,ఏడీఈ సివిల్ నిజామాబాద్,ఏఈ బోధన్ ఈ.సుమిత, ఏఈ కోటగిరి బుజ్జిబాబు,ఏఈ సివిల్ నిజామాబాద్ కార్తీక్,ఏఈ ప్రొటెక్షన్ భవిత,భాస్కర్,ప్రసాద్,శివ ప్రసాద్, మాజీ సర్పంచ్లు రఫీ,ఎజాజ్ ఖాన్,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నీరడి గంగాధర్, ఎమ్మార్వో గంగాధర్,ఎంపీడీవో విష్ణు, పొతంగల్ మండల సర్పంచ్ ఫోరం అధ్యక్షులు సిందే షాజి పాటిల్,పిఎసిఎస్ కోటగిరి చైర్మన్ కూచి సిద్దు,మాజీ ఎంపిటిసి కొట్టం మనోహర్, జడ్పిహెచ్ఎస్ ఎత్తొండ పాఠశాల హెడ్మాస్టర్ అలివేలి,ఉమ్మడి మండలంలోని ఆయా గ్రామాల సర్పంచులు,సీనియర్ నాయకులు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు,ప్రజలు పాల్గొన్నారు.

## స్పీకర్ జన్మదిన వేడుకలకు సేవా స్ఫూర్తి జోడింపు

**పేద విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీకి మోమిన్‌పేట్ కాంగ్రెస్ నాయకుల ముందడుగు**



**మోమిన్‌పేట్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి ప్రసాద్ కుమార్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన ఇచ్చిన పిలుపు మేరకు పేద విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ కార్యక్రమాన్ని మోమిన్‌పేట్ మండలంలో ఘనంగా నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమాన్ని వికారాబాద్ జిల్లా డీసీసీ ప్రధాన కార్యదర్శి వారాల సిరాజుద్దీన్ సౌజన్యంతో చేపట్టడం జరుగుతుందని వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన నోట్‌బుక్‌స్‌ను అందజేసి వారి విద్యాభ్యాసానికి చేయూతనివ్వడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మన్నే శంకర్ యాదవ్, మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ పి. మహేందర్ రెడ్డి, మండల సర్పంచ్ సంఘం అధ్యక్షుడు కోస్గి సురేందర్ ఆధ్వర్యంలో ఈ పంపిణీ కార్యక్రమం నిర్వహించబడుతుందని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని నాయకులు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..సభాపతి ప్రసాద్ కుమార్ జన్మదినాన్ని కేవలం వేడుకగా కాకుండా సేవా కార్యక్రమాల ద్వారా జరుపుకోవడం స్ఫూర్తిదాయకమని అన్నారు. విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని అందించడం ద్వారా వారి చదువులకు ప్రోత్సాహం లభిస్తుందని పేర్కొన్నారు .ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి,మహమ్మద్ హాజీ,వార్డు సభ్యుడు మహమ్మద్ అఫ్సర్,యువ నాయకుడు మహమ్మద్ తాజ్ తదితరులు పాల్గొన్నారు."విద్యార్థుల చిరునవ్వులే ప్రసాద్ అన్నకు నిజమైన జన్మదిన కానుక" అనే సందేశంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాయకులు ఆకాంక్షించారు.

## ఉమ్మడి మండలల సొసైటీ వైస్ చైర్మన్ గా ఎల్పటి అశోక్ కుమార్ ?



**చౌడాపూర్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** ఉమ్మడి కులకచర్ల చౌడాపూర్ ప్రాథమిక సహయ సహకార సంఘం వైస్ చైర్మన్ గా చౌడాపూర్ మండల మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎల్పటి అశోక్ కుమార్ పేరు ఖరారు చేసినట్లు సమాచారం. ఇప్పటికే కామునిపల్లి గ్రామ పరిధిలో జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. కాబోయే ఉమ్మడి కులకచర్ల మండల సొసైటీ వైస్ చైర్మన్ గా అన్న మాట నిజమైంది. మరో రెండు రోజుల్లో ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడనున్నాయి. ప్రమాణస్వీకారం కోసం భారీగా ఏర్పాట్లు చేయాలని సన్నాహాలు చేస్తున్నారు.

## కాళికా మాత కళ్యాణ మహోత్సవం

- ముఖ్యఅతిథిగా మండల ఎంపీడీఓ సోమలింగం
- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శేఖర్,అశోక్ కుమార్



**చౌడాపూర్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** చౌడాపూర్ మండల పరిధిలో మండలం మక్త వెంకటాపూర్ గ్రామంలో మాజీ సర్పంచ్ అనిత శివ పవర్ గారి వ్యవసాయ క్షేత్రంలో నిర్మించినటువంటి శ్రీ శ్రీ శ్రీ కలికామాత కల్యాణ మహోత్సవ పూజ కార్యక్రమంలో కార్యక్రమము లో ఎంపీడీఓ సోమలింగం మండల పార్టీ అధ్యక్షులు చంద్రశేఖర్. మాజీ మండల అధ్యక్షులు ఎల్పటి ఆశోక్ కుమార్. వివిధ గ్రామాల పంచాయతీ సెక్రెటరీలు గ్రామ ప్రజలు నాయకులు పాల్గొన్నారు

## కోటగిరి ఎస్ఐగా జి.శ్రీనివాస్

**కోటగిరి,స్నేహిత ఎక్స్ ప్రెస్:** కోటగిరి ఠాణా నూతన ఎస్ఐగా జి.శ్రీనివాస్ శుక్రవారం పదవి బాధ్యతలు స్వీకరించారు.ఇటీవల కాలంలో కోటగిరి ఎస్ఐగా బాధ్యతలు నిర్వహించిన సునీల్ నిజామాబాద్ టౌన్ కు బదిలీ అయ్యారు.నిర్మల్ టౌన్ నుండి జి.శ్రీనివాస్ కోటగిరి ఠాణాకు బదిలీపై వచ్చారు.ఉమ్మడి మండలాలలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఆయన కోరారు.



## ప్రాణుల మనుగడకు ప్రకృతే జీవనాధారము

- ప్రతి ఒక్కరూ మొక్కలు నాటండి
- పర్యావరణాన్ని పరిరక్షించండి, ఎంపీడీవో సోమలింగం
- ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఎంపీడీవో కార్యాలయం ముందు మొక్కలు నాటిన అధికారులు రాజకీయ నాయకులు
- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శేఖర్, మాజీ అధ్యక్షులు అశోక్,
- మండల అధికారులు





**చౌడాపూర్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** చౌడాపూర్ మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయం ముందు ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలను నాటడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ..పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అనే నినాదాన్ని నిజం చేస్తూ, ప్రాణుల మనుగడకు ప్రకృతే జీవనాధారమని, పుడమి పచ్చగా ఉంటేనే ప్రతి జీవి సుభిక్షంగా ఉంటుందని, భావితరాలకు మంచి జరగాలంటే మనం ఇప్పటి నుంచే పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎంపీడీవో సోమలింగం అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ప్రపంచ పర్యావరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. చౌడపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శేఖర్ మాట్లాడుతూ... ప్లాస్టిక్ వాడకండి పూర్తిగా తగ్గించాలని, మన జీవితాలతో పూర్తిగా మమేకమై ఉన్న పర్యావరణాన్ని పరిరక్షించాలని, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి కర్తవ్యం అని, పర్యావరణ పరిరక్షణకై ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని, పర్యావరణాన్ని పరిరక్షించడం ద్వారా భావితరాలకు ఎంతో విలువైన సంపదను అందించిన వారమవుతామని, కాలుష్యపు కోరల నుండి మనల్ని మనం రక్షించుకోవడానికి, పర్యావరణాన్ని పరిరక్షించడానికి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, పర్యావరణ పరిరక్షణ మనందరి రక్షణ అని అన్నారు...ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మాజీ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఎల్పటి అశోక్ కుమార్ మాట్లాడుతూ... ప్రకృతి మనకు జీవనాధారం, స్ఫూర్తి, భవిష్యత్తుకు మార్గదర్శకం. నేడు వాతావరణ మార్పుల వల్ల ఎదురవుతున్న సవాళ్లను అధిగమిస్తూ, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలి" అని ఒక సందేశంలో పేర్కొన్నారు. ఒక మొక్కనాటడం, నీటిని ఆదా చేయడం, కాలుష్యాన్ని తగ్గించడం వంటి చిన్నచిన్న చర్యలే రేపటి తరాలకు సురక్షితమైన, స్వచ్ఛమైన భూమిని అందించగలవని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిని పరిమిల, మండల అధికారులు,రాజకీయ నాయకులు, తదితరులు పాల్గొనడం జరిగింది.

## పచ్చని భవిష్యత్తుకు యెన్కేపల్లి శ్రీకారం



**మోమిన్‌పేట్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని యెన్కేపల్లి గ్రామపంచాయతీ ఆవరణలో గురువారం మొక్కల నాటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామాన్ని పచ్చదనంతో నింపి, భావితరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కోస్గి సురేందర్ మాట్లాడుతూ..పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పుల నేపథ్యంలో మొక్కల పెంపకం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షిస్తే గ్రామం పచ్చదనంతో కళకళలాడుతుందని తెలిపారు.అనంతరం గ్రామపంచాయతీ ఆవరణలో పలు రకాల మొక్కలను నాటి వాటి సంరక్షణకు ప్రతిజ్ఞ చేశారు. గ్రామ ప్రజలు కూడా ఉత్సాహంగా పాల్గొని పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతను నిర్వర్తిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ ఎండీ.అబ్దుల్ మానన్, గ్రామ కార్యదర్శి అరుంధతి, ఫీల్డ్ అసిస్టెంట్ అడివిరెడ్డి,కాంగ్రెస్ నాయకులు ,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు. పచ్చదనం పెంపొందిద్దాం, పర్యావరణాన్ని పరిరక్షిద్దాం అనే నినాదంతో నిర్వహించిన ఈ కార్యక్రమం గ్రామంలో పర్యావరణ చైతన్యాన్ని పెంపొందించింది.

# ఉద్యాన పంటల సాగుపై రైతుల్లో అవగాహన కల్పించాలి

- ఉద్యాన సాగు పంటలకు ప్రభుత్వం ప్రాధాన్యత
- ఉద్యాన సాగు పంటలతో అధిక లాభాలు
- జిల్లా కలెక్టర్ దీపక్ తివారి




**వికారాబాద్,స్నేహిత ఎక్స్‌ప్రెస్:** స్నేహిత ఎక్స్ ప్రెస్: వికారాబాద్ జిల్లాలో ఉద్యాన పంటల సాగు ద్వారా అధిక లాభాలను ఆర్జించే విధంగా రైతుల్లో అవగాహన కల్పించి ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేటులోని కాన్ఫరెన్స్ హాల్లో ఉద్యాన పంటల సాగు, ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ తదితర అంశాలపై భాగస్వామ్య శాఖలు, నాబార్డ్, వ్యవసాయ శాస్త్రవేత్తలు, ఇరిగేషన్, డ్రిప్,ఆయిల్ ఫామ్ కంపెనీల ప్రతినిధులు, రైతులతో జిల్లా ఉద్యానవన పట్టు పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో జిల్లా మిషన్ పర్యవేక్షణ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యాన పంటల సాగుకు ఎంతో ప్రాధాన్యత ఇస్తుందన్నారు. జిల్లాకు ఇచ్చిన లక్ష్యాలకు అనుగుణంగా ఉద్యాన పంటలను సాగు చేయాలని, దీనివల్ల రైతులు అధిక లాభాలను ఆర్జించేందుకు వీలు ఉంటుందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఉద్యాన పంటలు సాగు చేసుకునేందుకు సారవంతమైన భూములు ఉన్నాయని,భూసార పరీక్షలకు అనుగుణంగా పంటలను సాగు చేయాలని కలెక్టర్ సూచించారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యానవన పంటలకు సబ్సిడీ ఇవ్వడం జరుగుతుందని, రైతులు ఇలాంటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకునే విధంగా రైతులను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. ఉద్యానవన పంటల మొక్కలు నాటేందుకు, నిర్వహణ ఖర్చులకు ప్రభుత్వం మంచి అవకాశాన్ని కల్పిస్తుందని ఈ అవకాశాన్ని రైతులు సత్యం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.జిల్లాలో సర్పంచులు, ప్రజా ప్రతినిధులను భాగస్వాములను చేసి ఉద్యాన మన పంటల సాగుకు రైతులను రైతులను ఎంపిక చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. జిల్లాలోని ఎస్సీ,ఎస్టీ రైతులను గుర్తించి ఆయిల్ ఫామ్ సాగు చేస్తున్న ప్రాంతాలకు తీసుకువెళ్లి క్షేత్రస్థాయిలో వంట సాగుపై అవగాహన కల్పించాలని ఆయన తెలిపారు. ఆయిల్ ఫాం సాగు చేసుకున్నట్లయితే 30 సంవత్సరాల వరకు అతికొద్ది శ్రమతో ఆర్థికంగా అధిక లాభాలు సాధించవచ్చని అదేవిధంగా అంతర్ పంటలు వేసుకునేది కూడా మంచి అవకాశం ఉంటుందని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. జిల్లాలో ఆయిల్ ఫామ్ అధికంగా సాగు చేయడం వల్ల ప్రాసెస్ యూనిట్లను ఏర్పాటు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. ఆయిల్ ఫామ్ సాగు చేయడంలో జిల్లా 5వ స్థానంలో ఉందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 80 పాలీ హౌస్ ల యూనిట్ లను గుర్తించడం జరిగిందని,ఇప్పటివరకు 44 యూనిట్లు పూర్తి అయ్యాయని ఆయన అన్నారు . ప్రభుత్వం ఉల్లిగడ్డ గిడ్డంగి, వర్మి కంపోస్ట్ యూనిట్, శాశ్వత పందిరీలు, పట్టు పరిశ్రమ, మల్బరీ ప్లాంటేషన్ కు కూడా ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని కలెక్టర్ తెలిపారు.హైదరాబాద్ నగరం అతి సమీపంలో ఉన్నందున పండ్లు, కూరగాయలు, పూలు మార్కెటింగ్ చేసుకునేందుకు మంచి అవకాశం ఉందని దీని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకునే విధంగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపించాలని కలెక్టర్ తెలిపారు. రైతుల్లో సాంకేతిక పరిజ్ఞానంతో పంటలు సాగు చేసుకునే విధంగా శిక్షణలు ఇవ్వాలని కలెక్టర్ తెలిపారు.మూడు నెలలకు ఒకసారి భాగస్వామ్య శాఖలతో సమావేశాలు నిర్వహించాలని అదేవిధంగా నియోజకవర్గ స్థాయిలో సమావేశాలు నిర్వహించి నూతన సాంకేతిక పద్ధతిలో పంట ఉత్పత్తిని ఎలా పెంచాలి అనే దానిపై రైతులకు ఎప్పటికప్పుడు పలు సూచనలు సలహాలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ అధికారులను సూచించారు.ఈ సమావేశంలో జిల్లా ఉద్యాన వన పట్టు పరిశ్రమల అధికారి సత్తార్,వ్యవసాయ శాఖ అధికారి రాజారత్నం, జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి కమలాకర్ రెడ్డి,రైతులు, వివిధ విభాగాల అధికారులు ప్రతినిధులు పాల్గొన్నారు.



Printed, Published, Edited & Owned by **Rathod Vinod Kumar**, Printed At Falcon Printing Press, **SNEHITHA PUBLICATIONS** #1-2-201,Shop No 2, Khan Street, Zaheerabad Town,Sangareddy Dist: Pin :502220, State :Telangana, Published at SNEHITHA PUBLICATIONS #1-2-201,Shop No 2, Khan Street, Zaheerabad, 502220, Dist: Sangareddy, T.S., Editor: **Rathod Vinod kumar**, RNI. No. APTEL/2009/29308, Cell: 9550021491,8341021491Mail :expresstelugudaily@gmail.com